క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్టకు కేతిరెడ్డికి ఆహ్వానం


కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాడిపత్రిటౌన్: నియోజకవర్గంలోని పెద్దవడుగూరులో ఈ నెల 8న నిర్వహించే వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్టకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆహ్వానించారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు తాడిపత్రిలోని కేతిరెడ్డి నివాసానికి వచ్చి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శరభారెడ్డి, అనిల్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, రామచంద్రారెడ్డి, బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మండల మీట్


నిధుల మంజూరులో జాప్యంపై ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

పామిడి: పట్టణంలోని ఎంపీడీఓ సభాభవనంలో శుక్రవారం నిర్వహించిన మండలమీట్ రసాభాసగా సాగింది. ఎంపీపీ భోగాతి మురళీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీఓ కే తేజోత్స్న సారథ్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు డీసీ ముత్యాల్‌రెడ్డి, మూలి నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేష్ నాయక్ పలు సమస్యలను విన్నవించారు. పంచాయతీ అభివృద్ధి పనుల కోసం వెచ్చించిన నిధుల మంజూరులో జాప్యంపై వారు విరుచుకుపడ్డారు. పంచాయతీ అభివృద్ధి నిధులను ప్రస్తుతం అత్యవసర పనుల నిమిత్తం వినియోగిస్తున్నామని ఈఓ కమ్ ఈఓఆర్డీ సీ అశ్వర్థ నాయుడు తెలిపారు. అభివృద్ధి నిధులు మంజూరవ్వగానే మంజూరు చేస్తామని ఆయన తెలపడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం అన్నిశాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేరం స్వర్ణలతకు పరామర్శ


పేరం స్వర్ణలతతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బ్రెయిన్ సంబంధిత సర్జరీ అనంతరం తాడిపత్రిలోని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట రాష్ట్ర పార్లమెంటరీ కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, ఓబులరెడ్డి ఉన్నారు. అలాగే తాడిపత్రిలో జరిగిన పలు వివాహాలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్ రెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ భోగాతి నారాయణరెడ్డి, ఆలూరు రామేశ్వరెడ్డి హాజరై వధూ వరులను ఆశీర్వదించారు.

నార్పలలో 7న వాల్మీకి జయంతి వేడుకలు

శింగనమల (నార్పల): నార్పల మండలంలో ఈ నెల 7న వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి తలారి రామాంజి తెలిపారు. మాడుగుల రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి పూజలు ప్రారంభిస్తామన్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 3 గంటలకు గ్రామోత్సవం ఉంటుందని, మండలంలోని వాల్మీకులు హాజరు కావాలన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పుట్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీ శ్రీనివాసరావు శిక్షణలో బాక్సింగ్‌కు సంబంధించి ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 1న అనంతపురంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ప్రత్యూష, భార్గవి, అంజలి, బిందు, వైష్ణవకుమార్‌రెడ్డి, మణికంత, భరత్‌కుమార్, విజయ్‌కుమార్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు.


పెద్దపప్పూరులో జ్యోతుల మహోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు


నార్పలలో వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న గ్రామస్తులు


గుత్తిలోని కోట వీధిలో రేణుకా ఎల్లమ్మ పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం


తాడిపత్రిలో శమీ వృక్షం వద్దకు ఊరేగింపుగా వచ్చిన పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరుడు

అంబరం.. దసరా సంబరం

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో గురువారం దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పల్లె నుంచి పట్టణాల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు, దేవుళ్ల ఊరేగింపులు, రథోత్సవాలు, పల్లకీసేవలు, రావణ దహనం కోలాహలంగా నిర్వహించారు. భక్తులు జమ్మి వృక్షానికి పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అమ్మవార్లకు మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. – సాక్షి బృందం:


తాడిపత్రిలో దుర్గామాత విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగింపు


గుంతకల్లులో మస్తాన్‌పేట మారెమ్మదేవిని ఊరేగిస్తున్న దృశ్యం


గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న మైనార్టీ నాయకులు


గుంతకల్లులోని చౌడేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న నైరుతిరెడ్డి


తాడిపత్రిలో ఆకట్టుకుంటున్న అమ్మవారి విశ్వరూప దర్శనం


పుట్లూరులో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న ఎంపీపీ రాఘవరెడ్డి తదితరులు


పామిడిలో అంబాభవాని మాతను ఊరేగిస్తున్న దృశ్యం


పామిడిలో కన్యకా పరమేశ్వరిమాతను ఊరేగిస్తున్న దృశ్యం


యల్లనూరులో అమ్మవారిని ఊరేగిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

విశ్రాంత ఉద్యోగులు ప్రశాంత జీవితం గడపాలి


సెటిల్‌మెంట్ చెక్కును అందజేస్తున్న డీఆర్‌ఎం

గుంతకల్లు: పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ప్రశాంతమైన జీవితం గడపాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో ఇటీవల గుంతకల్లు డివిజన్ పరిధిలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలు సెటిల్‌మెంట్ ఫంక్షన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 11 మందికి రూ.1.95 కోట్లు బకాయిలకు సంబంధించి చెక్కులను డీఆర్‌ఎం అందజేశారు కార్యక్రమంలో డీపీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దాం


గుంతకల్లులో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


యాడికిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘం నేతలు

గుంతకల్లుటౌన్/యాడికి: గాంధీ జయంతిని గుంతకల్లులో ఘనంగా నిర్వహించారు. గురువారం మెయిన్‌రోడ్డులోని గాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుమోబాషా, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్ మాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, ఉపాధ్యక్షుడు సూర్యకిరణ్, కార్యదర్శి కరీమ్, పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు మౌలా, పవన్, బాసిద్, షాబుద్దీన్, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఎంఎం.రెహమాన్, నాయకులు నూర్‌నిజామి, ఆర్‌డీజీ.బాషా, డ్యామ్‌వలి, హుసేన్, మహమ్మద్, మహబూబ్‌బాషా, లోకేష్, ప్రతాప్,ఖలందర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికిలో ఆర్య వైశ్య సంఘం సభ్యులు గాధం శెట్టి బలరామయ్య, ఆదిత్య పవన్, విశ్వనాథ్, మద్దిలేటి, ప్రసాద్ తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి రాముడు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని టి.కొత్తపల్లికి చెందిన రాముడు పని నిమిత్తం బైక్‌లో కల్లూరుకు బయలుదేరాడు. అయితే కొత్తపేట గ్రామ శివారులో రోడ్డుపై కుక్కను తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

జొన్న సొప్ప నరుకుతుండగా గాయం

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చిన్న జొన్నగిరి గ్రామానికి చెందిన రైతు జయకృష్ణ జొన్న సొప్పను కొడవలితో నరుకుతూ ప్రమాదవశాత్తూ చెయ్యిని నరుక్కున్నాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు అతడి చెయ్యికి 13 కుట్లు వేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్థల వివాదంలో ఘర్షణ

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో స్థలం వివాదంలో శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామంలోని ఖాళీ స్థలం విషయంలో తలెత్తిన వివాదం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసినట్లు పోలీసులు తెలిపారు. ఘర్షణలో నాగేశ్వరయ్య, అచ్చమ్మ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులనుఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో పాముకాటు వేయడంతో మహిళ తీవ్ర అస్వస్థతకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖాజాబీ గురువారం రాత్రి పని నిమిత్తం ఇంటి బయటకు వెళ్లింది. చీకట్లో ఆమె కాలికి పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాలిక అదృశ్యం

యాడికి: మండలంలోని కుందన కోటలో ఓ బాలిక అదృశ్యమైంది. శుక్రవారం ఉదయం ఆ బాలిక యాడికిలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు బస్సులో బయలుదేరింది. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

పోటాపోటీగా ద్విచక్ర వాహనాల స్లో పందేలు

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరులో గురువారం దసరా ఉత్సవాల్లో భాగంగా ద్విచక్ర వాహనాల స్లో పందెలు పోటీలు నిర్వహించారు. పోటీల్లో కల్లూరు, ఇల్లూరు, పామిడి గ్రామాల నుంచి 19 మంది ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లూరుకు చెందిన వంశీక్రిష్ణ మొదటి బహుమతి, ఇల్లూరుకు చెందిన అంజనేయులు రెండో బహుమతి గెలుపొందారు. వారికి దాత నాగరాజు వరుసగా రూ.2,000, రూ.1000 నగదు అందజేశారు.

షిరిడీ సాయి బాబా నిర్యాణ దినోత్సవం

గుత్తి: పట్టణంలోని షిరిడీ సాయి బాబా ఆలయంలో శుక్రవారం నమూనా షిరిడీ సాయి బాబా సమాధి వద్ద నిర్యాణ దినోత్సవం నిర్వహించారు. సాయి బాబా సమాధి చెంది 107 సంవత్సరాలు అయిన సందర్భంగా నమూనా సమాధిపై 107 క్యాండిల్స్ వెలిగించారు. భక్తులు తరలి వచ్చి స్వామి వారి సమాధిని దర్శించుకుని పూజలు చేశారు.

ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామ సభలు

పుట్లూరు/గార్లదిన్నె: పుట్లూరు మండలంలో ఉపాధి పనుల గుర్తింపు కోసం శుక్రవారం గ్రామసభలు నిర్వహించినట్లు ఏపీఓ తులసీప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సి.వెంగన్నపల్లి, కడవకల్లు, సూరేపల్లి, కందికాపుల గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి పనుల ఎంపిక కోసం ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించామన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలని యర్రగుంట్ల, ముకుందాపురం, ఎంపీఆర్ డ్యాం, పెనకచెర్ల గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ సీసీ, ఏపీఓ ఓబ, టీఏ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ ఆరోహణరావు బాధ్యతల స్వీకరణ



తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణ సీఐగా ఆరోహణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు సీసీఎస్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించే సాయిప్రసాద్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన సంగతి విదితమే.

ఉపాధ్యాయులకు నైపుణ్యాలు అవసరం


మాట్లాడుతున్న ఏపీసీ శైలజ

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) శైలజ సూచించారు. బీకేఎస్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న విజయ భారతి డీఈడీ కళాశాలలో జిల్లాలో ఎంపికైన ఎస్జీటీలకు ఇండక్షన్ ట్రెనింగ్‌ను ఆమెతోపాటు డీవైఈఓ శ్రీనివాసులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ట్రైనింగ్ ఇస్తున్నామన్నారు.ఈ శిక్షణా కార్యక్రమానికి 148 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో గోవర్ధన్, ఎంఈఓలు లింగా నాయక్, విజయాకుమారి, ఏఎంఓ వేణు గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సేవాఘడ్‌లో మాత జగదాంబకు చక్రస్నానం


అలంకరణలో మాత జగదాంబ

గుత్తి రూరల్: మండలంలోని సేవాఘడ్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మాత జగదాంబ ఆలయంలో అమ్మవారికి చక్రస్నానం, మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు మారుతీప్రసాద్, శ్రీహరి సాయిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొలకెత్తిన అంకురాలను సమర్పించారు. సేవాఘడ్‌లోని పురవీధుల్లో జగదాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అశ్వత్థనాయక్, రంగనాయక్, శేఖర్‌నాయక్, మీటునాయక్, వెంకటరమణనాయక్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

‘చలో కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయండి’

పామిడి: ఆర్టీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరణకు కోసం ఈ నెల 6న తలపెట్టిన చలో కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కోరింది. శుక్రవారం స్థానిక పీ కొండాపురం రోడ్డులోని దివ్యాంగుల భవనం వద్ద ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు వడ్ల సర్వేస్ అధ్యక్షతన దివ్యాంగుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కేశవాచారి, ఉపాధ్యక్షుడు నీలూరు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి శివన్న, నాగభూషణం, నరసింహులు, రహంతుల్లా, వడ్డే లక్ష్మయ్య, మల్లికార్జున, కేశవ, ఓబుళపతి, సుధాకర్, హనుమాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రీ సర్వే

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరులో శనివారం నుంచి రీ సర్వే ప్రారంభించనున్నట్లు డీఐఓఎస్ నాగరాజు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జయమ్మ, మండల సర్వేయర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం గ్రామంలోని రచ్చబండ కట్ట వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో రైతులు సిబ్బందికి సహకరించాలన్నారు. వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మేజర్ పంచాతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకురాలు, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామ సభ నిర్వహించారు. ముందుగా సచివాలయంలో గాంధీ మహాత్ముని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాసులు, రామ్ సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యార్మీ పండుగ గంధం ఊరేగింపు

పామిడి: పట్టణంలో శుక్రవారం రాత్రి జెండా కట్ట కమిటీ ఆధ్వర్యంలో గ్యార్మీ పండుగ గంధం ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫస్ట్ వార్డు స్కూల్ వద్ద ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు, జెండాకట్ట కమిటీ మాజీ ప్రెసిడెంట్ దివంగత సీ మొహిద్దీన్ గృహం నుంచి జెండాకట్ట వరకూ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా జెండాకట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు, చదివింపులతో నెలరోజుల పాటు నిర్వహించే ఈ గ్యార్మీ పండుగను ఘనంగా ప్రారంభించారు.

శివాలయ నిర్మాణానికి భూమి పూజ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో నూతనంగా పేట ఉమా మహేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించడానికి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.కోటి దాకా నిధులు మంజూరు చేసిందని , మండల ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గుదలపై అవగాహన


యాడికి: జీఎస్టీ తగ్గింపుపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జీఎస్టీ తగ్గింపుపై ముద్రించిన కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేల్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సోనియాతార, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శశికళ, జీఎస్టీ అధికారులు రమేష్, శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

‘దివ్యాంగుడి అరెస్ట్ దారుణం’

శింగనమల: మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై ఫేస్ బుక్‌లో పోస్ట్ పెట్టాడని మడకశిర పోలీస్‌లు బుధవారం అర్ధరాత్రి నార్పలకు వచ్చి దివ్యాంగుడు మిద్దె చిన్న కుళ్లాయప్పను పట్టుకుపోయి హింసించడం దారుణమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరికూటి కాటమయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ పేరుతో అమాయకులను హింసిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

ఎస్ఈసీ సభ్యుల నియామకం


బొంబాయి రమేష్‌నాయుడు


భోగతి నారాయణరెడ్డి

తాడిపత్రిటౌన్/యల్లనూరు: తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి మండలకేంద్రానికి చెందిన బొంబాయి రమేష్‌నాయుడు, అలాగే శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరుకు చెందిన భోగతి నారాయణరెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియామకమయ్యారు. గురువారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు వారు వేర్వేరుగా తెలిపారు. తమపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కాగా ఆయా మండలాల్లో వారిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి అభినందించారు.